క్లుప్తంగా

క్రీడలతో దేశానికి గుర్తింపు



పతకం సాధించిన వర్షిణిని సత్కరిస్తున్న రోటరీ సభ్యులు

బోట్‌క్లబ్‌: క్రీడల ద్వారా దేశానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం ద్వారా క్రీడాకారులకు సముచిత ప్రాధాన్యం లభిస్తుందని రోటరీ క్లబ్‌ మాజీ గవర్నర్‌ డాక్టర్‌ ఎస్‌వీఏ స్‌రావు అన్నారు. రోటరీ గోల్డెన్‌ జూబ్లీక్లబ్‌ ఆర్థిక సహాయంతో థాయ్‌లాండ్‌లో జరిగిన అంతర్జాతీయ రైఫిల్‌ షూటింగ్‌ పోటీల్లో పాల్గొని రజత పతకం సాధించిన దంగేటి వర్షిణి నాగమహాలక్ష్మిని మంగళవారం క్లబ్‌ ఆధ్వర్యంలో సత్కరించారు. క్రీడాకారులను ప్రోత్సహించడం ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులకు మంచి గుర్తింపు లభించడమే కాక మన నగరానికి కూడా గౌరవం తీసుకొచ్చినవారవుతారన్నారు. క్లబ్‌ అధ్యక్షుడు జీవీ కృష్ణప్రకాష్‌, కార్యదర్శి వడ్డాది ఆదిత్య, సభ్యులు చోడిశెట్టి పద్దరాజు, చార్మినార్‌ వర్మ, చేయూత రవి, పాబోలు చినపున్నయ్య పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌ పరీక్షల్లో ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులు

బాలాజీచెరువు: జాతీయ స్థాయిలో 8వ తరగతి విద్యార్థులకు ఉపకార వేతనాలకు నిర్వహించే ఎన్‌ఎంఎంఎస్‌(జాతీయ ఉపకార ప్రతిభ ప్రవేశ) పరీక్షలో గోడారిగుంట మదర్‌ థెరిసా నగర పాలక ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. విద్యార్థులు రోషిణి, ప్రవల్లిక, కాగజ్‌, సాహితి, బిందు, సాధిక్‌రాజ్‌, ప్రతిభ చూపగా శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులు మద్రే వెంకట రమణను పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు వై.శ్రీనివాస్‌, పాఠశాల సిబ్బంది అభినందించారు.

ఉభయ తెలుగు రాష్ట్రాల కవితల పోటీలు

కాకినాడ కల్చరల్‌: సాగర స్రవంతి సాహితీ పీఠం, సీతారామరాజు స్మారక కళా వేదిక సంయుక్త ఆధ్వర్యంలో ఉభయ తెలుగు రాష్ట్రాల పరిధిలో 'పర్యావరణ పరిరక్షణ – మన బాధ్యత' అంశంపై కవితల పోటీలు నిర్వహిస్తున్నట్టు పీఠం సాహితీ కార్యదర్శి పీఎస్‌ఎస్‌ఎస్‌పీ శాస్త్రి తెలియజేశారు. ఔత్సాహిక రచయితలు, కవులు ముప్పై లైన్లు మించకుండా కవితలు రాసి ఈ నెల 25వ తేదీ లోపు పీఎస్‌ఎస్‌ఎస్‌పీ శాస్త్రి, సాహిత్య కార్యదర్శి, సాగర స్రవంతి, డోర్‌ నెం: 59–13–3,4, కోనయ్య వీధి, జగన్నాథపురం, కాకినాడ చిరునామాకు పంపించాలన్నారు. మరిన్ని వివరాలకు 98480 76620 మొబైల్‌లో సంప్రదించాలని తెలిపారు.

నేడు జోతిష్య సదస్సు

కాకినాడ కల్చరల్‌: స్థానిక విద్యుత్‌నగర్‌లోని చల్లా కల్యాణ మంటపంలో బుధవారం పరాశర అకాడమీ ఆఫ్‌ ఆస్ట్రలాజికల్‌ సైన్సెస్‌ ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయి జోతిష్య సదస్సు నిర్వహించనున్నట్టు ఆర్గనైజింగ్‌ కమిటీ కన్వీనర్‌ సరిపెల్ల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. జోతిష్య శాస్త్రంపై ప్రత్యేక పరిశోధనల ప్రసంగాలు సదస్సులో ఉంటాయన్నారు. ప్రముఖ జోతిష్య పండితులను సత్కరిస్తారని తెలిపారు.

మెంటల్‌ ఆసుపత్రికి ఆరుద్ర, ఆమె కుమార్తె

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో నిరవధిక నిరాహార దీక్ష కొనసాగిస్తూ తన కుమార్తె వైద్యాన్ని అడ్డుకుంటున్న ఆరుద్రతో పాటు ఆమె కుమార్తె సాయి లక్ష్మిని వైద్యుల సూచన మేరకు విశాఖపట్నం మెంటల్‌ ఆసుపత్రికి తరలించినట్లు ఎస్పీ ఎస్‌.సతీష్‌కుమార్‌ తెలిపారు. సోమవారం అర్ధరాత్రి జీజీహెచ్‌ నుంచి ప్రత్యేక అంబులెన్సులో వారిని విశాఖపట్నానికి తరలించామన్నారు. ఆరుద్రతో పాటు ఆమె కుమార్తె ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా మరింత మెరుగైన వైద్యం అందించేందుకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

కెనాల్‌ రోడ్డులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం



పోలీసులు స్వాధీనం చేసుకున్న మృతదేహం

సామర్లకోట: కాకినాడ కెనాల్‌ రోడ్డులో వీకే రాయపురం నుంచి మాధవపట్నం వెళ్లే రోడ్డులో సర్పవరం రైల్వే జంక్షన్‌ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని మంగళవారం పోలీసులు గుర్తించారు. 40–45 సంవత్సరాల మధ్య వయసు కలిగి ముఖం నల్లగా కమిలిపోయి ఉందన్నారు. మృతుడు నీలం గళ్లు కలిగిన షర్టు, బిస్కెట్‌ కలర్‌ ఫ్యాంటు ధరించి ఉన్నట్లు చెప్పారు. కుడి చేతికి రింగ్‌ ధరించే వేలు లేదని, మధ్య వేలికి వెండి ఉంగరం ఉందన్నారు. పోలియో కారణంగా పడిపోయి, చనిపోయి ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి సీఐ కె.దుర్గాప్రసాద్‌ దర్యాప్తు చేస్తున్నారు. వివరాలకు 94407 96568, 97016 26505 ఫోన్‌ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సమస్యలకు మోక్షం.. సర్వత్రా హర్షం

- జేఎన్‌టీయూకేలో తీరనున్న ముంపు బెడద
- వర్సిటీలో డ్రైనేజీ, రోడ్ల నిర్మాణ పనులు
- ఆనందపడుతున్న వర్సిటీ అధ్యాపక, విద్యార్థి సంఘాలు



వర్షాకాలంలో జేఎన్‌టీయూకే వర్సిటీ (ఫైల్‌)



సాగుతున్న సిమెంట్‌ రోడ్డు పనులు

బాలాజీచెరువు: జేఎన్‌టీయూ కాకినాడ ఏర్పాటు చేసి దశాబ్దం దాటినా, ముగ్గురు వీసీలు పనిచేసినా పట్టించుకోని ప్రధాన సమస్యలు ప్రస్తుతం పరిష్కారం అవుతుండడంతో విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు. అన్ని ఉన్నా అల్లుడు నోట్లో శని అన్న చందనా ప్రణాళికలు, సలహాలు, సూచనలు ఇచ్చే అధికారులు ఉన్నా వాటిని పరిగణలోకి తీసుకోకుండా అప్పటి వీసీలు కాలయాపన చేశారు. నిధులు సమృద్ధిగా ఉన్నప్పటికీ ఇబ్బందిగా మారిన డ్రైనేజీ సమస్యపై స్పందించలేదు. కొద్దిపాటి వర్షం వస్తే వర్సిటీ చెరువును తలపించేది. నగరం నడిమధ్యలో దాదాపు 70 ఎకరాల పైబడి విస్తీర్ణంలో ఉన్న వర్సిటీలో వర్షాకాలం వస్తే సమస్యలు చెప్పనక్కర్లేదు. అధ్యాపకులతో పాటు దాదాపు 2,000 మంది విద్యార్థులు, 700 మంది నాన్‌టీచింగ్‌ సిబ్బందితో పాటు వివిధ పనులపై వర్సిటీకి అనుబంధ కళాశాలల జిల్లాల నుంచి వచ్చే వారు చెరువులా తలపించేలా ఉన్న వర్సిటీ ప్రాంగణం వల్ల అనేక అవస్థలు పడేవారు. ముఖ్యంగా వర్సిటీ ఆవరణలో ఉన్న అధ్యాపకుల క్వార్టర్స్‌ వద్ద నీరు నిలిచిపోవడంతో దోమల సమస్యతో నిత్యం నరకం అనుభవించేవారు. నాగావళి, మహిళ హాస్టల్స్‌, పోస్టల్‌ కార్యాలయం పక్కన ఇలా ప్రతి ప్రాంతం నీటితో నిలిచిపోయేది. వర్షం వెలసిన పది, పదిహేను రోజుల వరకూ నీరు ఇంకిపోవాలే తప్ప బయటకు పోయే మార్గం ఉండేది కాదు. వీసీగా బాధ్యతలు చేపట్టిన ప్రొఫెసర్‌ జీవీఆర్‌ ప్రసాదరాజు తొలి సమావేశంలోనే దీనిపై దృష్టి సారించి దాదాపు రూ.20 కోట్లతో రోడ్లు డ్రైనేజీలకు ప్రతిపాదనలతో పాటు టెండర్లు ప్రక్రియ వెంటనే పూర్తి చేయించారు. పనులు పూర్తి చేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించారు.

> **రెండు నెలల్లో పూర్తి..**
>
> 
>
> వర్సిటీలో ప్రధాన సమస్య ప్రధాన సమస్యలైన డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నాను. ఇదే వర్సిటీలో రిజిస్ట్రార్‌, ప్రిన్సిపాల్‌ వంటి వివిధ హోదాల్లో పనిచేశాను. ప్రధాన సమస్య గుర్తించి వెంటనే పూర్తిచేసేలా ప్రత్యేక శ్రద్ధ వహించాను. త్వరితగతిన పూర్తి చేసేలా ఇంజినీరింగ్‌ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష చేస్తున్నాను. వర్సిటీకి ప్రధాన సమస్యగా ఉన్న ఈ విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యం వహించకుండా రెండు నెలల్లో పనులు పూర్తి చేస్తాం.
>
> – డాక్టర్‌ జీవీఆర్‌ప్రసాద్‌రాజు, వీసీ, జేఎన్‌టీయూకే

క్యాంపస్‌ డ్రైవ్‌ రేపు

బాలాజీచెరువు: ఆదిత్య డిగ్రీ కళాశాలలో గురువారం ఇండియా సిమెంట్స్‌ వారి పూల్‌ క్యాంపస్‌ డ్రైవ్‌ నిర్వహిస్తున్నట్లు కళాశాల అకడమిక్‌ డైరెక్టర్‌ బీఈవీఎల్‌ నాయుడు తెలిపారు. ఎంఎస్‌ఎస్సీ ఆర్గానిక్‌ కెమిస్ట్రీ పూర్తిచేసిన అభ్యర్థులు హాజరుకావచ్చని, ఎంపికైన వారు ఉభయ తెలుగు రాష్ట్రాలలో క్వాలిటీ అస్యూరెన్స్‌ విభాగంలో పనిచేయవలసి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు 94418 28747 నంబర్‌లో సంప్రదించవచ్చన్నారు.

16 నుంచి గరికిపాటి ప్రవచనాలు

కాకినాడ కల్చరల్‌: స్థానిక సూర్యకళామందిర్‌లో సరస్వతీగాన సభ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు మహాసహస్రావధాని పద్మశ్రీ గరికిపాటి నరసింహారావు ప్రవచనాలు ఉంటాయని గానసభ కార్యవర్గ సభ్యులు తెలిపారు. రోజూ సాయంత్రం 6 గంటలకు ప్రవచనం ప్రారంభిస్తారని తెలిపారు. నలదమయంతి అంశంపై జరిగే ప్రవచన కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులే అని సభ్యులు తెలిపారు.

కెనాల్‌ ఆవరణ సుందరీకరణపై దృష్టి



సుందరీకరణ పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్‌ డాక్టర్‌ మహేష్‌కుమార్‌

కాకినాడ: స్థానిక ఇంద్రపాలెం వంతెన నుంచి ప్రతాప్‌నగర్‌ బ్రిడ్జి వరకు కెనాల్‌కు ఇరువైపులా సుందరీకరణ చేపడుతున్నట్టు కమిషనర్‌ డాక్టర్‌ మహేష్‌ కుమార్‌ రావిరాల చెప్పారు. కెనాల్‌కు ఇరువైపులా ఉన్న కొబ్బరిబొండాలు, చెత్త, చెదారం ఇతర వ్యర్థాలను తొలగించే ప్రక్రియ కోసం స్పెషల్‌ డ్రైవ్‌ చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని కమిషనర్‌ డాక్టర్‌ మహేష్‌కుమార్‌ మంగళవారం పర్యవేక్షించారు. శుక్రవారం నాటికల్లా కెనాల్‌కు ఇరువైపులా పరిశుభ్రత ప్రక్రియ పూర్తిచేస్తామని చెప్పారు. అత్యంత ప్రధానమైన ఈ ప్రాంతాన్ని సుందరంగా తీర్చిదిద్దేందుకు చేస్తున్న కృషిలో ప్రజలు కూడా భాగస్వామ్యం వహించాలన్నారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, స్థానికులు ఆ ప్రాంతంలో చెత్త వేయవద్దని విజ్ఞప్తి చేశారు. అలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్నో వ్యయప్రయాసలకోర్చి కెనాల్‌ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేస్తున్నామని, అందువల్ల ప్రజలు కూడా తోడ్పాటునివ్వాలని కోరారు. ఆయన వెంట అదనపు కమిషనర్‌ సీహెచ్‌ నాగనరసింహారావు, నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్‌ పృథ్వీచరణ్‌, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

చీరల పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న రాజబాబు తనయుడు రమేష్‌ చంద్ర తదితరులు

కాకినాడ కల్చరల్‌: దివంగత సినీ, టీవీ నటుడు బి.రాజబాబు ఆదర్శప్రాయుడని జనవిజ్ఞాన వేదిక గౌరవ అధ్యక్షుడు స్టాలిన్‌ అన్నారు. స్థానిక ది యంగ్‌మెన్స్‌ హ్యాపీక్లబ్‌ దంటు కళాక్షేత్రంలో రాజబాబు జయంతి మంగళవారం నిర్వహించారు. ముందుగా బి.రాజబాబు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చిత్రనటుడిగానే కాకుండా కళారంగంలో ఎంతోమందికి భవిష్యత్తు ఇచ్చిన గొప్ప కళాకారుడు బి.రాజబాబు అని ఇండియన్‌ రెడ్‌ క్రాస్‌ సొసైటీ తూర్పు గోదావరి శాఖ అధ్యక్షుడు వైడీ రామారావు అన్నారు. అనంతరం పేద మహిళలకు చీరల పంపిణీ చేశారు. పేద కళాకారులకు నగదు పంపిణీ చేశారు. నటులు కోటేశ్వరరావు, రజిత్‌ మూర్తి, ఆలపాటి లక్ష్మి, విజయలక్ష్మిలకు రాజబాబు స్మారక అవార్డులు ప్రదానం చేసి సత్కరించారు. రమేష్‌, జానకీరామ్‌చౌదరి, బి.వీరన్న, శ్రీను బాబు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే సీజ్‌ చేస్తాం

కొత్తపల్లి: మైనర్లకు వాహనాలు ఇస్తే వాటిని సీజ్‌ చేస్తామని సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు అన్నారు. ఉప్పాడ–కాకినాడ బీచ్‌ రోడ్డులో మంగళవారం ఆయన పర్యటించారు. వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలను నడుపుతున్న మైనర్లకు కౌన్సిలింగ్‌ ఇచ్చారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. వారు వాహనాలు నడిపితే సీజ్‌ చేస్తామని తెలిపారు. ముఖ్యంగా తీర ప్రాంతంలో పర్యాటకులు తప్పని సరిగా జాగ్రత్తలు పాటించాలని, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసిన ప్రాంతాల్లోనే సముద్ర స్నానాలు చేయాలని సూచించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది తలెత్తకుండా పోలీసులకు సహకరించాలన్నారు. ఆయన వెంట ఎస్సై రామలింగేశ్వరరావు, సిబ్బంది ఉన్నారు.

ఏలేరు కాలువలో తగ్గిన నీటి నిల్వలు



నీటినిల్వలు అడుగంటిన ఏలేరు కాలువ

ఏలేశ్వరం: వేసవి ఎండలకు ఏలేరు కాలువలో నీటి సరఫరా తగ్గుముఖం పట్టింది. దీంతో కాలువపై ఆధారపడిన మూగజీవాలకు తాగునీరు లేక నానాపాట్లు పడుతున్నాయి. మండల వ్యాప్తంగా ఏలేశ్వరం, తిరుమాలి, యర్రవరం గ్రామాల మీదుగా సుమారు ఏడు కిలోమీటర్ల మేర ఏలేరు కాలువ ఉంది. ఈ కాలువలో నీరే ఆయా గ్రామాల పశువులకు ఆధారం. వేసవిలో సాయంత్రమైతే కాలువలో వీటిని శుభ్రం చేసి తాగునీటి అవసరం తీర్చుతుంటారు. ప్రస్తుతం ఏలేరు జలాశయంలో నీటినిల్వలు తగ్గుముఖం పట్టడంతో కాలువలో నీటి సరాఫరా తగ్గిపోయింది. దీంతో తాగునీటి కోసం పశువులు అల్లాడుతున్నాయి. గ్రామాల్లో పశువులకు నీటితొట్టెలు నిర్మించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఆకట్టుకొన్న చీకటి పువ్వు



చీకటి పువ్వు నాటికలో ఒక సన్నివేశం

కాకినాడ కల్చరల్‌: స్థానిక ది యంగ్మెన్స్‌ హ్యాపీక్లబ్‌ దంటు కళాక్షేత్రంలో కాకినాడ కల్చరల్‌ అసోసియేషన్‌ ఆధ్వర్యంలో రెండు రోజులు జరుగుతున్న జాతీయ స్థాయి నాటిక పోటీలు ఆకట్టుకుంటున్నాయి. భాగంగా మంగళవారం సాయంత్రం జ్యోతి వెలిగించి నాటికల ప్రదర్శన ప్రారంభించారు. ముందుగా చైతన్య కళాభారతి (కరీంనగర్‌) సమర్పణలో రమేష్‌ మంచాల దర్శకత్వంలో 'చీకటి పువ్వు' నాటిక ప్రదర్శించి ప్రేక్షకులను ఆకట్టుకొన్నారు. క్షమించడంలోనే నిజమైన ప్రేమ ఉందని నాటికలో చాటి చెప్పే ప్రయత్నం చేసి ప్రేక్షకులను మెప్పించారు. అనంతరం మిత్రా క్రియేషన్స్‌ (హైదరాబాద్‌) సమర్పణలో దేవాబత్తుల జార్జి దర్శకతంలో ప్రదర్శించిన 'అందిన ఆకాశం' నాటిక ప్రేక్షకులను ఆలోచింప చేసింది. కని పెంచిన కూతురుకు మంచి సంబంధం చూసి వివాహం చేసి మంచి జీవితం ఇవ్వాలని తల్లిదండ్రులు కలలు కంటారు. అయితే కూతురు వివాహం కాకుండానే గర్భవతి అని తెలిస్తే ఎంత కుమిలిపోతారు అన్నది నాటికలో కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు. అసోసియేషన్‌ కన్వీనర్స్‌ ఎన్‌.ప్రభుదాస్‌, కృష్ణారావు, జానకీరామ్‌చౌదరి పాల్గొన్నారు.

నేటి ప్రదర్శనలు

నాటిక పోటీలలో భాగంగా బుధవారం సాయంత్రం 6 గంటలకు ఎన్‌.రవీంద్రరెడ్డి దర్శకత్వంలో అభినయ ఆర్ట్స్‌ (గుంటూరు)వారి 'అతీతం' నాటిక, అనంతరం శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం (గోరువంక) వారి బీఎం ఎస్‌ పట్నాయక్‌ దర్శకత్వంలో 'కొత్త పరిమళం' నాటికలు ప్రదర్శిస్తామని కృష్ణారావు తెలిపారు.

సార్వా సాగుకు రైతులను సన్నద్ధం చేయండి

బయో కంట్రోల్‌ ల్యాబ్‌ ఏడీఏ రత్నప్రశాంతి



సదస్సులో ప్రసంగిస్తున్న ల్యాబ్‌ ఏడీఏ రత్నప్రశాంతి

పెద్దాపురం: సార్వా సాగుకు రైతులందరినీ సన్నద్ధం చేయాల్సిన బాధ్యత ప్రతి ఒక్క వ్యవసాయ, ఉద్యాన శాఖ సహాయకులపై ఉందని కాకినాడ బయో కంట్రోల్‌ ల్యాబ్‌ ఏడీఏ ఎం.రత్నప్రశాంతి, డీఆర్‌సీ బీవీఎస్‌సీ ఎహూ రి అన్నారు. స్థానిక రైతు శిక్షణ కేంద్రంలో మంగళవారం ''సార్వా సాగుకు సమాయాత్తం'' అంశంపై మండలంలోని వ్యవసాయ శాఖ సహాయకులు, ఉద్యాన శాఖ సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దాపురం ఏడీఏ దైవకుమార్‌ అధ్యక్షతన జరిగిన శిక్షణ సదస్సులో రత్నప్రశాంతి, హరి మాట్లాడుతూ రైతులందరూ ఈ నెలాఖరులోగా వరిపంట వెదజల్లే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువుల మందులు, కలుపు మందులను ఆర్‌బీకేల వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. బోర్ల కింద పంటలు పండించే రైతు లు పంటమార్పిడి చేసుకునే విధంగా వీఏఏ, వీహెచ్‌ఏలు కృషి చేయాలన్నారు. ఏడీఏ దైవకుమార్‌ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయ క్షేత్రం ప్రతీ మండలంలోను ఏర్పాటు చేసి రైతులకు సార్వా సాగుపై అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పలు అంశాలపై వారికి అవగాహన కల్పించారు. పెద్దాపురం, కిర్లంపూడి ఏఓలు సంజయ్‌కుమార్‌, అమృత, హబ్‌ ఏఓ ఎస్‌.సుధ, ఏఈఓ ప్రసాద్‌ పాల్గొన్నారు.

పట్టణంలో కలెక్టర్‌ విస్తృత పర్యటన



సామర్లకోట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్‌

సామర్లకోట: కాకినాడ జిల్లా కలెక్టర్‌ కృతికా శుక్లా మంగళవారం పట్టణంలో విస్తృత పర్యటన నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని ఆరవ వార్డులో శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో జరుగుతున్న నాడు–నేడు పనులను పరిశీలించారు. పాఠశాలకు మంజూరు అయిన నిధులు, ఆ నిధులతో చేస్తున్న పనులపై ఆరా తీశారు. పాఠశాలలు తెరిచే సమయానికి అభివృద్ధి పనులు పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చినా ఎందుకు పూర్తి చేయలేదని పాఠశాల హెచ్‌ఎంను ప్రశ్నించారు. పాఠశాలకు వచ్చిన జగనన్న విద్యాకానుక కిట్లు, గోరుముద్ద అమలు వంటి వాటిపై సమాచారం సేకరించారు. అసంపూర్తిగా ఉన్న పనులు 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆస్పత్రిలోని స్త్రీ, పురుషుల వార్డులు, మాతాశిశు వార్డులను పరిశీలించారు. కలెక్టర్‌ కృతికా శుక్లా స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఆస్పత్రిలో రోగులకు అందుతున్న సేవలను తెలుసుకున్నామన్నారు. రోగులు సంతృప్తి వ్యక్తం చేశారని, 24 గంటలూ సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో ఉంటున్నారని రోగులు చెప్పారన్నారు. శారదాదేవి ఎలిమెంటరీ పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులను 15 రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశాలు ఇచ్చామన్నారు. డీఈఓ కె.అన్నపూర్ణ, డిప్యూటీ డీఈఓ డానియల్‌ రాజు, ఎంఈఓ వై.శివరామకృష్ణయ్య, మున్సిపల్‌ కమిషనర్‌ జె.రామారావు, డీసీహెచ్‌ఓ డాక్టరు పీబీ విష్ణువర్ధని, తహసీల్దార్‌ ఎస్‌ఎల్‌వీ కుమారి, ఉపాధ్యాయులు, డాక్టర్లు పాల్గొన్నారు.

విత్తన శుద్ధిపై అవగాహన



విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న నాగేశ్వరరావు

పెద్దాపురం: విత్తన శుద్ధిపై ప్రతీ రైతుకు అవగాహన అవసరమని రిలయన్స్‌ ఫౌండేషన్‌ మేనేజర్‌ బర్రే నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కట్టమూరు, కాండ్రకోట గ్రామాల్లో వ్యవసాయ శాఖ, రిలయన్స్‌ ఫౌండేషన్‌ సంయుక్త ఆధ్వర్యంలో ఆయా గ్రామాల వీఏఏల అధ్యక్షతన మంగళవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ ఏడాది 150 మంది రైతులను డిజిటల్‌ ఫామ్‌ స్కూల్‌ను ఏర్పాటు చేసి పలు వ్యవసాయ పద్ధతులపై సలహాలు, సూచనలు ఇస్తామన్నారు. కేజీ విత్తనానికి ఎనిమిది గ్రాముల సుడోమోనస్‌ కలిపి 24 గంటల తరువాత పొలంలో వెదజల్లుకోవచ్చన్నారు. రైతులు విత్తనశుద్ధి చేయడం ద్వారా వరి పంటలో తొలిదశలో ఆశించే తెగుళ్లను అరికట్టవచ్చన్నారు. రైతులు తమ పంట పొలాలు, పశువులు, వాతావరణం గురించి సమాచారం తెలుసుకోవాలంటే రిలయన్స్‌ ఫౌండేషన్‌ టోల్‌ ఫ్రీ నంబర్‌ 180041 98800కి ఉదయం 9.30 నుంచి సాయంత్రం 7.30 గంటలలోపు తెలుసుకోవచ్చని నాగేశ్వరరావు సూచించారు. వీఏఏలు స్రవంతి, అమృత, విజయదుర్గ, రైతులు నల్లల గోవిందు, మూర్తి, చక్రధరరావు, సుబ్రహ్మణ్యం, రమేష్‌ బాబు, రైతులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉద్యానంగా..

- పార్కుల్లో వేసవి సందడి
- కళకళలాడుతున్న వైనం
- ఆటపాటలతో గడుపుతున్న పిల్లలు



గాంధీనగర్‌ పార్కులో సందర్శకుల సందడి

బోట్‌క్లబ్‌: వేసవికాలం వచ్చిందంటే చాలు.. చిన్న, పెద్ద అనే తేడా లేకుండా ఇంటి నుంచి కాసేపు అలా బయటకు వచ్చి ఆనందంగా.. ఆహ్లాదంగా గడపాలనుకుంటారు. చిన్నారులు సందడి అంతా ఇంతా కాదు. పిల్లల ఆటపాటలతో పార్కులు, ఖాళీ స్థలాలన్నీ కళకళలాడుతున్నాయి. పెద్దల ఆరోగ్యం, యువత, చిన్నారులను దృష్టిలో ఉంచుకొని వైఎస్సార్‌ సీపీ ప్రభుత్వం పార్కులు, గ్రీన్‌బెల్ట్‌ల్లో అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. దీనిలో భాగంగానే వార్డుల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేశారు. కాకినాడ కార్పొరేషన్‌ ఏర్పాటు చేసిన ఓపెన్‌ జిమ్‌లు ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయి.

ఆహ్లాదకరమైన వాతావరణంలో..

ప్రభుత్వం ప్రస్తుతం ఒంటిపూట బడులు నిర్వహిస్తుండడంతో నగరంలోని బోట్‌క్లబ్‌, గాంధీనగర్‌, రాజాట్యాంకు పార్కుల్లో సందడి నెలకొంది. చిన్నారులు రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆటలాడుతూ ఆనందంలో మునిగిపోతున్నారు. స్థానిక బోట్‌క్లబ్‌ పార్కులో ఉదయం 5 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ వాకింగ్‌, ఓపెన్‌ జిమ్‌ చేస్తుంటారు. ప్రస్తుత వేసవికాలంలో పార్కులకు వచ్చే వారి సంఖ్య రెట్టింపయ్యింది.

సాధారణ రోజుల్లో పార్కుకు రానివారు కూడా వేసవి కాలం కావడంతో ఇంటిలో ఉన్న వేడిని తట్టుకోలేక చల్లటి గాలికోసం పార్కులకు వస్తున్నారు.

ఆటలతో ఎంజాయ్‌..

గాంధీనగర్‌ పార్కు, రాజాట్యాంకు పార్కులో చిన్నపిల్లలు ఆడుకోవడానికి ఊయల, జారుడు బల్లలతోపాటు షటిల్‌ ఆడుకోవడానికి కోర్టులు సైతం ఏర్పాటు చేయడంతో ఇక్కడకు రావడానికి చిన్నారులు ఇష్టపడుతున్నారు. స్థానిక భానుగుడి జన్మభూమి పార్కులో స్కేటింగ్‌ రింగ్‌ ఉండడంతో నేర్చుకొనేందుకు అధిక సంఖ్యలో పిల్లలు ఇక్కడకు వస్తున్నారు. సందర్శకులతోపాటు గేమ్‌లు ఆడుకోవడానికి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో పార్కులన్నీ కిటకిటలాడుతున్నాయి.

> **రోజూ ఆడుకుంటున్నాం**
>
> 
>
> బోట్‌క్లబ్‌ పార్కులో ఆడుకోవడం చాలా బాగుంది. ఒంటిపూట బడులు కావడంతో ఆడుకోవడానికి ఎక్కువ సమయం ఉంటోంది. మామూలు రోజుల్లో పార్కుకు వచ్చే సమయం ఉండేదికాదు. రోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటలు వరకూ పార్కులో ఆడుకుంటున్నాం.
>
> – దేవి శ్రీప్రజ్ఞ

> **ఆట సామగ్రి బాగుంది**
>
> 
>
> మాది వైజాగ్‌. అమ్మమ్మ ఇంటికి వేసవి సెలవుల కోసం కాకినాడ వచ్చాను. గాంధీనగర్‌ పార్కు సమీపంలో అమ్మమ్మ వాళ్ల ఇల్లు. ఉదయం, సాయంత్రం ఆడుకోవడానికి పార్కులో ఉన్న సామగ్రి బాగుంది. జారుడు బల్లలు, ఊయలు, చిన్న పిల్లలకు జిమ్‌ పరికరాలు ఉన్నాయి.
>
> – శివరామకృష్ణ

కొనసాగుతున్న జెడ్పీటీసీ సభ్యుల శిక్షణ



సామర్లకోట ఈటీసీలో శిక్షణ పొందుతున్న జెడ్పీటీసీ సభ్యులు

సామర్లకోట: స్థానిక విస్తరణ శిక్షణ కేంద్రంలో శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు ఉన్న 11 జిల్లాల్లోని జెడ్పీటీసీ సభ్యులకు నిర్వహిస్తున్న శిక్షణ కొనసాగుతోంది. 11 జిల్లాల్లోని 222 మందికి శిక్షణ ఇవ్వవలసి ఉండగా బ్యాచ్‌కు 40 మందికి శిక్షణ ఇస్తున్నారు. దీనిలో భాగంగా నాల్గవ బ్యాచ్‌ శిక్షణ రెండవ రోజు మంగళవారం కొనసాగింది. బుధవారంతో వీరికి శిక్షణ ముగుస్తుంది. పశుసంవర్ధక శాఖ ఏడీ ఎస్‌.శ్రీనివాసరావు, హౌసింగ్‌ డీఈఈ ఆర్‌ఎస్‌కే రాజు, ఈటీసీ ఫ్యాకల్టీలు కేఆర్‌ నిహారిక, ఎంఎస్‌ఎన్‌ రెడ్డి, వి.ప్రసాద్‌, ఆంజనేయులు శిక్షణ నిర్వహించారు.